మోసపోతే గోస పడతాం

- సంక్షేమానికి పట్టం కట్టండి
- రైతుల పాలిట వరం 'ధరణి'
- బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి
- అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని పిలుపు


సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజం ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోతే గోస పడతామని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేషన్‌డీలర్ల, సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజం సభ్యులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజం సభ్యులు మహిపాల్‌రెడ్డికి ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పెన్షన్, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు ప్రవేశపెట్టి అన్నివర్గాలకు అండగా నిలుస్తోందని వివరించారు.

మహిపాల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు

పటాన్‌చెరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి అతీక్ తమ బృందంతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డిని కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎల్ఐజీ, మ్యాక్ సొసైటీలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, షకీల్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆయన అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేశామన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అనేక పరిశ్రమలను తీసుకొచ్చామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్ సింధురెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్మర్‌బస్తీలో ఇంటింటి ప్రచారం

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ ప్రాంతాన్ని దోచుకున్న కాంగ్రెస్, తెలంగాణ ప్రజలపై విషం చిమ్ముతున్న బీజేపీ ప్రజలు నమ్మి గోస పడవద్దని బీఆర్ఎస్ జిల్లా నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, పటాన్‌చెరు క్షత్రియ రాజ్‌పుత్ అధ్యక్షుడు రాజేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలోని కమ్మర్‌బస్తీలో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు శంకర్, కంకర్ శీను, బబుల్ రెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

బూత్ కార్యాలయం ప్రారంభం

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్‌తో కలిసి బీఆర్ఎస్ నూతన బూత్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బూత్ ముఖ్య కార్యకర్తలు, ఇతర కార్యకర్తలను కలుపుకొని ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

తుమ్మల రిశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో..

పటాన్‌చెరు: బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా అమీన్‌పూర్ మున్సిపాల్ బీఆర్ఎస్ నాయకులు తుమ్మల రుశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 2వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ కృష్ణ, బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ పెద్దింటి దీపక్‌రెడ్డి, నాయకులు కొండకల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ సభ్యులు, టీంకురెడ్డి, నిఖిల్ రెడ్డి, జయసూర్య, సుకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి సభ ఏర్పాట్ల పరిశీలన

పటాన్‌చెరు: మండల పరిధిలోని ఇస్నాపూర్ చౌరస్తాలో ఈ నెల 16న నిర్వహించనున్న మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీల హామీలను నమ్మొద్దు


ఆత్మీయ సమ్మేళనం లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్, బీజేపీల వాగ్దానాలను నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ అసోసియేషన్, తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌కు కండువా కప్పుతున్న మహిపాల్‌రెడ్డి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జిన్నారంలో ప్రచారం ముమ్మరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో పాటు, నియోజకవర్గంలో మహిపాల్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. బీఆర్ఎస్ విజయానికి ప్రతిఒక్కరూ సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మంద రమేష్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జహీరాబాద్: ఝరాసంగం మండలంలోని చీలపల్లి తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. జహీరాబాద్‌లోని అతిథిహోటల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తండాకు చెందిన మాజీ సర్పంచ్ చందర్‌తో పాటు కార్యకర్తలు ఆ పార్టీ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు విజేందర్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందజేత

పటాన్‌చెరు టౌన్: ఇటీవల మరణించిన పార్లే ఆగ్రో పరిశ్రమకు చెందిన కార్మికుడి కుటుంబానికి బుధవారం పరిహారం అందజేశారు. మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని పార్లే ఆగ్రో పరిశ్రమకు చెందిన కుంచారం సాయికుమార్ మూడు నెలల క్రితం వివిధ కారణాలతో మరణించాడు. దీంతో బాధితుడి కుటుంబానికి పరిశ్రమ నుంచి వచ్చే అన్ని రకాల బెనిఫిట్స్‌తో పాటు కార్మికుల ఒకరోజు వేతనంతో కలిపి రూ. 2,73,472 చెక్కును యూనియన్ అధ్యక్షులు రాజయ్య, హెచ్ఆర్ కరీం, యూనియన్ నాయకులు అందజేశారు. రాజయ్య మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ సంతోష్‌కుమార్‌గౌడ్, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్, బొబ్బిలిగామ తదితర గ్రామాల్లో సంగారెడ్డి బీజేపీ అభ్యర్థి పులిమామిడి రాజు ఆ పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విరాళాల సేకరణ


పరిశ్రమ ప్రతినిధులతో దేవాలయ నిర్మాణ నిర్వాహకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో నూతనంగా నిర్మించనున్న శివాలయ నిర్మాణానికి నిర్వాహకులు బుధవారం విరాళాలు సేకరించారు. జిన్నారం, బొంతపల్లి గ్రామాల శివారులోని పలు పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి దేవాలయ నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు యాజమాన్యాలు సానుకూలంగా స్పందించారని నిర్వాహకులు కార్యక్రమంలో ఆలయ నిర్మాణ నిర్వాహకులు పాల్గొన్నారు.

సాకి చెరువు పరిశీలన


వ్యర్థాలను తొలగింపజేస్తున్న కార్పొరేటర్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరుకు చెందిన బీహార్ రాష్ట్ర ప్రజలు పట్టణంలోని సాకి చెరువు వద్ద జరుపుకునే చాట్ పూజకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సాకి చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులోని వ్యర్థాలను తొలగింపజేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎంటమాలజీ విభాగం నాగార్జునరెడ్డి, రాంకీ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం.. మహాదానం


సీతారామమ్మ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీలో నివాసం ఉంటే సీతారామమ్మ (80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న అదే కాలనీకి చెందిన కల్యాణి వారి కుటుంబసభ్యులను కలిసి మృతి చెందిన సీతారామమ్మ నేత్రాలను దానం చేయడంతో ఇద్దరికీ చూపునివ్వచ్చని కుటుంబ సభ్యులకు వివరించింది. ఈ విషయాన్ని బెల్ మాజీ నేత్రదాన కార్యక్రమం అంబాసిడర్ పాండురంగారావుకి తెలియజేయగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర ఆస్పత్రి ద్వారా నేత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగారావు మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చిన సీతరామమ్మ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్పస్వాముల పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని గడ్డపోతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంలో బుధవారం అయ్యప్ప స్వాములు గురుస్వామి శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పూజల్లో సర్పంచ్ ప్రకాశ్‌చారి, నాయకులు శ్రీనివాస్‌చారి, బాలయ్య, ప్రదీప్, ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జహీరాబాద్ రూపురేఖలు మారుస్తా

- ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం
- బీఆర్ఎస్, బీజేపీల హామీలను నమ్మొద్దు
- కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం


మల్‌చల్మ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య, కుమార్తె

న్యాల్‌కల్(జహీరాబాద్): రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే జహీరాబాద్ రూపురేఖలు మారుస్తానని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అన్నారు. న్యాల్‌కల్ మండల పరిధిలోని హుస్సేన్‌నగర్, చీకుర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజన్‌వాడ, చాల్కి, మెరియంపూర్, రత్నాపూర్, రాఘవాపూర్, హుమ్నాపూర్, చినిగెపల్లి, అత్నూర్, డప్పూర్ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం జహీరాబాద్ ఉన్న వివిధ ఫ్యాక్టరీలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేసినవని గుర్తు చేశారు. నాయకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి, శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

జహీరాబాద్: నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ సతీమణి ప్రమీల, కుమార్తె బిందు ప్రియ మల్‌చల్మ, శేఖాపూర్ గ్రామాల్లో వారు పర్యటించి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


కాకిజన్‌వాడలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న చంద్రశేఖర్

కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అధోగతి

- ఆరు గ్యారంటీలను నమ్మొద్దు
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం
- బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


రేజింతల్‌లో పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): కాంగ్రెస్‌కు అధికారమిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. భాగంగా న్యాల్‌కల్ మండల పరిధిలోని మామిడ్గి, రేజింతల్, రుక్మాపూర్, రుక్మాపూర్ తండా, తాట్‌పల్లి, టేకూర్, మిర్జాపూర్(ఎస్), ముంగి తదితర గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ ఇచ్చే హామీలను నమ్మి ప్రజలు మోసపోద్దని కోరారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్, పాండురావు పాటిల్, బస్వరాజ్ పాటిల్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కుత్బొద్దీన్, అమీర్, మల్‌రెడ్డి, వీరారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మారుతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మాణిక్‌రావు సతీమణి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే మాణిక్‌రావు సతీమణి మధులత పట్టణంలో 13వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆమె వెంట నాయకులు నామ రవికిరణ్ గుప్తా, బండి మోహన్, రాకేష్, రాజు, శేఖర్, నగేష్ మహిళలు ఉన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆమెను పలువురు శాలువాతో సన్మానించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి


ఝరాసంగం : మాట్లాడుతున్న వెంకటేశం

ఝరాసంగం(జహీరాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం అన్నారు. మండల పరిధిలోని బర్దీపూర్, పొట్టిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ రాజు, కేతకి ఆలయ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు సిద్దన్నపాటిల్, కృష్ణ, రమేష్ పాటిల్ పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మద్యం మత్తులో మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన ఏసుదాసు అలియాస్ ఏసు (32) పెయింటింగ్ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. కాగా ఏసుదాసు మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 14న సాయంత్రం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఏసుదాసు కోసం అతని కుటుంబసభ్యులు వెతుకుతున్న క్రమంలో రామచంద్రాపురం పట్టణంలోని మంజీరాబార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న మురుగుకాలువలో పడి వ్యక్తి చనిపోయాడని సమాచారం అందింది. దీంతో వెంటనే వెళ్లి చూడగా మురుగు కాలువలో పడి చనిపోయింది ఏసుదాసే అని గుర్తించారు. మద్యం మత్తులో కాలువలో పడి చనిపోయి ఉంటారని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ సమాజ్‌కు స్థలం కేటాయించాలని వినతి


దేవిప్రసాద్‌ను కలిసిన బ్రాహ్మణ సమాజం సభ్యులు

జహీరాబాద్: బ్రాహ్మణ సమాజ సేవా సంస్థకు స్థలం కేటాయించాలని సమాజ్ సభ్యులు కోరారు. ఈ మేరకు నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఎకరం స్థలం కేటాయిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని, కానీ.. ఇంతవరకూ స్థలం కేటాయించలేదని గుర్తు చేశారు. ఇందుకు దేవిప్రసాద్ సానుకూలంగా స్పందించి మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. సమాజం అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే, కార్యదర్శి బాలచంద్ర జోషి, సభ్యులు రాఘవేంద్ర, శ్రీహరి జోషి, శ్యామ్‌రావు కుల్‌కర్ణి, పరమేశ్వర అయ్యర్, పీపీసీఎస్ డైరెక్టర్ నర్మద దేశ్‌పాండే, కవిత పాల్గొన్నారు.

వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి

ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ గ్రామంలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. బుధవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీలకు మట్టి తెప్పించి, పాలిథిన్ కవర్లలో నింపాలన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా ఎన్నికలు దగ్గర పడుతున్నందున, ఎన్నికలు సక్రమంగా నిర్వహిందుకు సరైన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రమేష్, ఈసీ భగవాన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి


వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని కుప్పానగర్ చౌరస్తాలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

108, 102 వాహనాల తనిఖీ


మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ జనార్దన్

జహీరాబాద్: పట్టణంలోని 108, 102 వాహనాలను ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ ఆధ్వర్యంలో ఏరియా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న వాహనాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఎంటీ, కెప్టెన్‌లకు తగు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 108, 102 వాహనాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈఎంఈలు హుసేన్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పులు అందజేయండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన ఓటర్లందరికీ ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు అందజేయాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభమైందని, ప్రతీ ఓటరుకు స్లిప్పు అందేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఈవీఎం, వీవీప్యాట్ మిషన్‌లపై అవగాహన కల్పించామన్నారు. ఈ నెల 19 తేదీ వరకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ వెంకటేశ్, ఆర్ఐ వెంకటేశ్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.